సాక్షి
ఖమ్మం
బుధవారం । 14 । ఆగస్టు । 2024



గురుకులంలో ఏసీబీ తనిఖీలు

కారేపల్లి మండలం గాంధీనగర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాన్ని తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు పలు లోపాలను గుర్తించారు. 8లో



బియ్యం సరఫరా చేయాలి

జిల్లాలో అన్ని రేషన్‌షాపులకు వెంటనే బియ్యం సరఫరా చేయాలని డీలర్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

జెండా ఎగురవేయనున్న డిప్యూటీ సీఎం భట్టి

- భద్రాద్రిలో తుమ్మల, వరంగల్‌లో పొంగులేటి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో గురువారం జరిగే వేడుకల్లో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగురవేస్తారు. పంద్రాగస్టు సందర్భంగా జిల్లాల్లో జాతీయ జెండాలు ఎగురవేసే మంత్రుల వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. భద్రాద్రి జిల్లాలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించనుండగా.. వరంగల్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎగురవేస్తారు.

సమస్యల పరిష్కారం.. పనుల్లో వేగం

- రైల్వే జీఎంతో ఎంపీ రఘురాంరెడ్డి భేటీ



జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: రైల్వే పరిధిలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎం భేటీ అయిన ఎంపీ మాట్లాడారు. కొత్తగూడెం సమీప గ్రామాలను అనుసంధానించేలా రోడ్డు రైల్వేస్టేషన్ సమీపాన ఇరుకుగా ఉన్నందున విస్తరణ కోసం రైల్వేశాఖ స్థలాన్ని కేటాయించాలని సూచించారు. అలాగే, కోవిడ్ సమయాన నిలిపేసిన రైళ్లన్నీ పునరుద్ధరించాలని కోరారు. అంతేకాక సికింద్రాబాద్ – భద్రాచలం రోడ్డు రైలును మణుగూరు వరకు పొడిగించాలని, ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన శ్రీనివాసనగర్ వద్ద అదనపు ట్రాక్ విస్తరణ పనులతో దెబ్బతిన్న చోట అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని కోరగా.. జీఎం సానుకూలంగా స్పందించారని ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు.

వచ్చే నెల 11వరకు స్కాలర్‌షిప్ దరఖాస్తు

ఖమ్మం సహకారనగర్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ ఈ.సోమశేఖర శర్మ తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న వారు ఆన్‌లైన్‌లో http//bse.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరికి సెప్టెంబర్ 24న పరీక్ష ఉంటుందని తెలిపారు.

33 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 97 మందిలో 58 హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు వివిధ విభాగాల్లో 33 మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

మహిళలకు చేపల వంటకాలపై శిక్షణ



వంటకాలను పరిశీలిస్తున్న మహిళా మత్స్యకారులు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో వివిధ జిల్లాల మహిళా మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ మంగళవారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా వీరికి చేపలు, రొయ్యలతో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీపై లావణ్య శిక్షణ ఇచ్చారు. అలాగే, చేపల కూర, పచ్చళ్లు, వేపుళ్లతో పాటు చేపలతో స్నాక్స్ తయారీపై అవగాహన కల్పించారు. హైదరాబాద్, వికారాబాద్, అనంతపురం, నంద్యాల జిల్లాల మత్స్యకారులు పాల్గొనగా వీరికి వికారాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య సర్టిఫికెట్లు అందజేశారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, అశ్వారావుపుట ఆత్మ డివిజన్ బ్లాక్ టెక్నికల్ మేనేజర్ శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ పాల్గొన్నారు.

చకచకా ఏర్పాట్లు..

రేపు వైరా రైతు సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఇక్కడే రూ.2లక్షల రుణమాఫీ చెక్కుల పంపిణీ
- ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం, మంత్రులు తుమ్మల, పొంగులేటి పరిశీలన
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు



వైరాలో జర్మన్ హ్యాంగర్లతో సిద్ధం చేసిన సభావేదిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లో మోటార్లను సీఎం ఆన్ చేస్తారు. ఆతర్వాత వైరా చేరుకుని రైతు రుణమాఫీ సదస్సులో ప్రసంగించనున్నారు. అలాగే, రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలలోపు రుణమాఫీకి సంబంధించి కొందరు రైతులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రైతులను ఆకట్టుకునేలా ఇక్కడ స్టాళ్ల ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా సభ

గోదావరి జలాలను ఉమ్మడి జిల్లా సాగుభూములకు అందించేలా తలపెట్టిన సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతుండగా ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్ కెనాల్) పనులు చివరి దశకు చేరుకున్నాయి. సీఎం గురువారం ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద పంపుహౌస్ మోటార్లను ఆన్ చేస్తారు. అక్కడ గోదావరి జలాలకు పూజలు చేశాక వైరాలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు సీఎం చేరుకుంటారు. ఈ సదస్సును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమనే సందేశం ఇవ్వాలనే లక్ష్యంతో మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్ నిరంతరం పరిశీలిస్తున్నారు.

భారీగా ఏర్పాట్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు రావడం ఇది రెండోసారి. రాష్ట్రవ్యాప్తంగా మూడో విడత రుణమాఫీకి సంబంధించి చెక్కుల పంపిణీ ఇక్కడే చేయనుండడం.. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ మోటార్లకు ముఖ్యమంత్రి స్విచ్చాన్ చేయనున్న నేపథ్యాన ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. వైరాలో 200 మంది కూర్చునేలా వేదిక నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా సభకు హాజరైన వారు ఎక్కడ కూర్చున్నా వీక్షించేలా 26 స్క్రీన్లు అమర్చారు. అలాగే, వ్యవసాయశాఖకు సంబంధించి పది, ఇతర శాఖలవి ఇరవై కలిపి మొత్తం 30 స్టాళ్ల ఏర్పాటవుతున్నాయి. ఇక కళాకారుల కోసం మరో వేదిక ఏర్పాటు చేశారు. అంతేకాక ముఖ్యమంత్రి విశ్రాంతి తీసుకోవడానికి ఒకటి, మంత్రుల కోసం మరో గ్రీన్‌రూమ్ సిద్ధమయ్యాయి. సభ నిర్వహణకు 15 ఎకరాల స్థలాన్ని గుర్తించగా ఎండ, వానకు ఇబ్బంది పడకుండా జర్మనీ పరిజ్ఞానం(జర్మన్ హ్యాంగర్స్)తో కూడిన షెడ్లు వేశారు. అలాగే సభకు వచ్చిన వారు కూర్చునేలా కుర్చీలు వేయిస్తున్నారు. అంతేకాక ఎండల దృష్ట్యా హాజరైన వారందరికీ మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జోరుగా ప్రచారం

వైరాలో జరిగే సభకు భారీగా జనం, రైతులను తరలించేలా కాంగ్రెస్ నాయకులు కొన్నాళ్ల నుంచి విస్తృత ప్రచారం చేస్తున్నారు. కళాకారులు మంగళవారం వైరాలో ప్రచారం చేయగా.. నాయకులు ముఖ్య కార్యకర్తలతో సమావేశమై జనసమీకరణపై పలు సూచనలు చేశారు. సభకు 50 వేల మంది జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. కాగా, సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు.

తొలుత 'సీతారామ' మోటార్ల స్విచ్చాన్

- అక్కడి నుంచి వైరా సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్ ఖరారు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 15న హైదరాబాద్‌లో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం హెలీకాప్టర్‌లో ఆయన ఇక్కడకు వస్తారు. ఈమేరకు సీఎం నాలుగు గంటల పాటు జిల్లాలో గడపనుండగా సీఎంఓ నుంచి షెడ్యూల్ విడుదలైంది.

షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 12–50 గంటలకు ములకలపల్లి మండలం పూసుగూడెంకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు.
- 12–55కు పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్ వద్ద పైలాన్ ఆవిష్కరించి పంప్‌హౌస్ మోటార్లను స్విచ్చాన్ చేస్తారు. ఆతర్వాత గోదావరి జలాలకు పూజ చేయడంతో పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడతారు.
- మధ్యాహ్నం 2–15గంటలకు అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 2–45 గంటలకు వైరా చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4–30 గంటల వరకు వైరా బహిరంగ సభలో మాట్లాడతారు. ఇక్కడే రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు రుణమాఫీ చెక్కులు అందజేశాక 4–45 గంటలకు హెలీకాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరతారు.

సాగుకు జీవం.. రైతుకు ఊతం



వేదిక నిర్మాణంపై సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఇచ్చిన మాట ప్రకారం 15న సీఎం వస్తున్నారు..
- గోదావరి జలాల రాకతో వైఎస్సార్ ఆత్మకు సంతృప్తి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా: సీతారామ ప్రాజెక్టు పూర్తవుతుండడంతో సాగుకు జీవం పోయనుండగా రైతులకు ఊతంగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వైరాలో ఈనెల 15న జరగనున్న సీఎం సభా ఏర్పాట్లను మంగళవారం ఆయన పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా రైతుల పొలాలకు నీళ్ల అంది భూమి విలువ పెరుగుతుందని తెలి పారు. కాగా, ప్రాజెక్టు పూర్తి కావాలంటే మరో రూ.10 వేల కోట్లు అవసరమని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు అందించేందుకు సీఎం వస్తున్న నేపథ్యాన లక్షలాదిగా రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ పథకం దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో 2009లో అమలుకాగా.. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. వైరా సభలో సీఎం రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు ఇవ్వనున్నప్పటికీ బుధవారం అర్ధరాత్రి వరకే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వాన కృషి జరుగుతోందని చెప్పారు. రాజీవ్ కెనాల్ కోసం రైతులు స్వచ్ఛందగా 150 ఎకరాలు ఇచ్చారని, తమ ప్రభుత్వం 70 రోజుల్లో రూ. 70 కోట్లు ఖర్చు చేసి సీతారామ నీటిని తీసుకొస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.8 వేల కోట్లు వెచ్చించినా ఎకరాకు నీళ్ల ఇవ్వలేదని తుమ్మల ఆరోపించారు. ఇప్పుడు గోదావరి జలాలు సాగుభూములకు చేరనున్న సందర్భంగా దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ఆత్మ సంతోషిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, దాసరి దానియేలు, గోను మధు, వడ్డె నారాయణ, పమ్మి అశోక్, దార్నా రాజశేఖర్, కట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా రిజర్వాయర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. రిజర్వాయర్‌లోకి ఈనెల 15న గోదావరి జలాలు రానున్నాయని చెబుతూ అక్కడ చేపల వేటలో నిమగ్నమైన మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలపై మంత్రి ఆరా తీశారు.

ఎలాంటి లోపాలు ఎదురుకావొద్దు

సీఎం సభా ఏర్పాట్లపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైరా: వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్న సీఎం సభా ఏర్పాట్లను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి మంగళవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్, అతిథుల వేదికతో పాటు కళాకారుల వేదిక, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సీఎం గ్రీన్‌రూంలను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, స్టాళ్ల, పార్కింగ్ పనులను కూడా పరిశీలించారు. సభకు హాజరయ్యే వారందరికీ తాగునీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ గణేష్, కార్పొరేషన్ చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు చేయండి

స్వాతంత్య్ర దినోత్సవంపై కలెక్టర్ సూచనలు



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌ను మంగళవారం పరిశీలించిన ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. బందోబస్తు, పోలీసుల కవాతు, జెండా ఆవిష్కరణ, ముఖ్యఅతిథి ప్రసంగంతో పాటు స్వాతంత్య్ర సమరయోధులు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలపై సూచనలు చేశారు. అడిషనల్ డీసీపీ ఏ.నరేష్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, ఏసీపీ సి.సుశీల్‌సింగ్, ఆర్‌ఎంఓ రాజశేఖర్, తహసీల్దార్ సీహెచ్.స్వామి పాల్గొన్నారు.

'ఓపెన్' స్కూల్ పోస్టర్ల ఆవిష్కరణ

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన 2024–25 విద్యాసంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించనుండగా పోస్టర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన వారికి ఓపెన్ స్కూల్ దోహదపడుతుందని తెలిపారు. డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, డీపీఆర్వో ఎంఏ.గౌస్ పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి నిత్యకల్యాణం వేడుకగా సాగింది. తెల్లవారుజామునే గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించి స్వామికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించారు. ఆపై నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇక మంగళవారం కావడంతో శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో ప్రత్యేక అభిషేకం చేశారు.

తిరంగా...

స్వాతంత్య్ర దినోత్సవానికి ఇంకా రోజే గడువు ఉండడంతో అధికారులు ఏర్పాట్లలో వేగం పెంచారు. ఇప్పటికే పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాల పనులు మొదలయ్యాయి. మరోపక్క ప్రభుత్వ కార్యాలయాలను మూడు రంగుల లైట్లతో అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌కు మంగళవారం రాత్రి లైట్లు అమర్చగా ఇలా మూడు వర్ణాల్లో కళకళలాడుతూ కనిపించింది.

– ఖమ్మం సహకారనగర్



ఆ మూడు అయితేనే!



అన్నపురెడ్డి మండలం కట్టుగూడెం హైవే వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

రేపు 'సీతారామ' మోటార్లు స్విచ్చాన్ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఇంకా సిద్ధం కాని పంప్‌హౌస్ - 3
- ఎన్‌హెచ్-30పై అసంపూర్తిగానే వంతెన నిర్మాణం
- ఏన్కూరు వద్ద కొలిక్కిరాని గ్యాస్ పైప్‌లైన్ అంశం
- అయినా భరోసాగా ప్రభుత్వవర్గాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు పంద్రాగస్టు నాటికి అందించాలనే లక్ష్యంతో గడిచిన రెండు నెలలుగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దృష్టి సారించారు. ఆ దిశగా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రెండు పంప్ హౌస్‌ల్లో ట్రయల్ రన్ కూడా పూర్తి కాగా.. గురువారం మోటార్లు స్విచాన్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారు. అయితే, ప్రాజెక్టులో కీలకమైన మూడు పనులు పూర్తి కాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది.

గ్యాస్ పైప్‌లైన్

గోదావరి జలాలు రాజీవ్ కెనాల్‌కు చేరడానికి మరో ప్రధాన అడ్డంకిగా ఏన్కూరు మండలంలో గ్యాస్ పైప్‌లైన్ ఉంది. గ్యాస్‌పైప్ ఉన్న చోట ప్రధాన కాల్వ నిర్మాణం ఎలా చేపట్టాలనే అంశంపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు పైప్‌లైన్ ఏర్పాటు చేసిన గుజరాత్ ప్రభుత్వానికి మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. ముందుగా సిద్ధం చేసిన డిజైన్‌పై గుజరాత్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతూ బాక్స్ డ్రెయిన్ డిజైన్ కావాలని పట్టుబట్టింది. దీంతో ప్రతిపాదనల్లో మార్పులు చేశారు. సీతారామ ప్రారంభోత్సవానికి ఇంకా ఒకే రోజు సమయం ఉండగా ఈ పని పూర్తికావడం కష్టమనే అభిప్రాయం నెలకొంది.

అయినా హైరానా అక్కర్లేదు..

గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగర్ ఆయకట్టుకు నీరు అందలేదు. దీంతో ఈ ఏడాది అలా జరగొద్దని రాజీవ్ కెనాల్ నిర్మాణం చేపట్టడమే కాక మూడు పంప్‌హౌస్‌లు, ప్రధాన కాల్వ నిర్మాణ పనులను ప్రభుత్వం వేగిరం చేసింది. ఇంతలోనే కృష్ణా నదికి వరద రావడంతో ఎన్‌ఎస్‌పీ ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందే అవకాశముంది. దీంతో ఇప్పటికిప్పుడు గోదావరి జలాలను రాజీవ్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లించాల్సిన అవసరం తప్పింది. ఫలితంగా పంప్‌హౌజ్-3, ఎన్‌హెచ్-30పై వంతెన, గ్యాస్ పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోయినా పెద్దగా హైరానా పడాల్సిన పని లేదనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో ఉంది.

జాతీయ రహదారి

మూడో పంప్‌హౌస్-3లో ఎత్తిపోసిన నీరు 54 కి.మీ. ప్రయాణించి జూలురుపాడు సమీపాన 102 కి.మీ. వద్ద రాజీవ్ కెనాల్‌కు చేరతాయి. అయితే మార్గమధ్యలో అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం దగ్గర ప్రధాన కాల్వ, విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్ -30) కలుస్తున్నాయి. దీంతో ఇక్కడ వంతెన నిర్మాణానికి ఆగమేఘాలపై అనుమతులు సాధించారు. శరవేగంగా పనులు చేయడంతో చివరి దశకు వచ్చినా పూర్తి కాలేదు. దీంతో ప్రధాన కాల్వలోకి వచ్చిన గోదావరి జలాలు రోడ్డును దాటే అవకాశం లేక... తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు అంటున్నారు.

పంప్‌హౌజ్ - 3

సీతారామ ప్రధాన కాల్వ వెంట 102 కి.మీ. దగ్గర కొత్తగా రాజీవ్ కెనాల్‌ను ప్రతిపాదించి గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జూన్ చివరి నాటికి అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్-1లో ట్రయల్ రన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఇంజనీర్లు రెండు, మూడు పంప్‌హౌస్‌ల్లో మోటార్లను సిద్ధం చేశారు. దీంతో ఈనెల 12న ములకలపల్లి మండలం పూసుగూడెంలోని పంప్‌హౌస్ -2, కమలాపురం పంప్‌హౌస్ -3కు ట్రయల్ రన్ చేపట్టాలని భావించారు. అయితే సాంకేతిక కారణాలతో ఆ రోజు కేవలం పంప్‌హౌస్-2 ట్రయల్ రన్ జరిగింది. అప్పటి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కూడా పంప్ హౌస్-2లో మోటార్లకు టెస్ట్ రన్ చేపట్టేందుకు అధికారులు శ్రమిస్తున్నా పనులు ఓ పట్టాన కొలిక్కి రావడం లేదు. మరోపక్క ఇంజనీరింగ్ అధికారులు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేసే సమయానికి మూడో పంప్‌హౌస్ సిద్ధం చేస్తామని చెబుతున్నారు.

క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం



స్వాతంత్ర్య సమరయోధురాలిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

మధిర: రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిరలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద మంగళవారం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. సుమారు 50 మంది సమరయోధులను సత్కరించగా ఎస్‌బీఐ పెన్షన్ డిపార్ట్‌మెంట్ చీఫ్ మేనేజర్ పవన్ మాట్లాడారు. ఎందరో యోధుల ఉద్యమాలు, త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. ఫలితంగా అందరం స్వేచ్ఛగా జీవిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర, సిరిపురం బ్రాంచ్ మేనేజర్లు రవికిరణ్‌రెడ్డి, ఉమేష్‌యాదవ్, పెన్షన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ డిప్యూటీ మేనేజర్ ఆర్.శివకుమార్‌తో పాటు పత్తేపురపు సంగయ్య, వంకాయలపాటి నాగేశ్వరరావు, కోనా నర్సింహారావు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాకు చెందిన ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈ విషయమై ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో బస్వనారాయణ (1994), వెంకటకృష్ణ (428), సూర్యచందర్‌రావు (384), సహదేవ్ (1679), నాగరాజు(1948), రామిరెడ్డి (797), చంద్రకళాధర్‌రావు (567), లక్ష్మణ్‌చౌదరి (302) ఉన్నారు. వీరికి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదల



నీరు విడుదల చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం ఎత్తిపోతల పథకం నుంచి మంగళవారం నీరు విడుదల చేశారు. కొంత కాలం క్రితం పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కావడంతో లిఫ్ట్ మూలనపడింది. ఈవిషయాన్ని స్థానిక నాయకులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించడమే కాక ఇతర మరమ్మతులు పూర్తి చేయించారు. దీంతో మంగళవారం లిఫ్ట్ నుంచి నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఖమ్మంకు చెందిన భక్తులు మంగళవారం విరాళం అందించారు. మామిళ్లగూడెంనకు చెందిన ఊటుకూరు శ్రీనివాసరావు రూ.1,00,116ను ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకున్నారు. అలాగే, హైదరాబాద్ కస్టమ్స్ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్‌ఎస్ అధికారి డీపీ నాయుడు కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ రమాదేవి, ఉద్యోగులు శ్రీనివాస్, సాయిబాబు పాల్గొన్నారు.

11 నెలల చిన్నారికి డెంగీ

సుజాతనగర్: మండల కేంద్రంలోని 11 నెలల చిన్నారికి డెంగీ నిర్ధారణ అయింది. సదరు చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణా కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారని మండల వైద్యాధికారి రమేశ్ మంగళవారం తెలిపారు. ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడమే కాక రెండు, మూడు రోజులు జ్వరం తగ్గకపోతే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,275	7,011
కందులు	7,000	7,000
మిర్చి	18,800	9,000
మిర్చి తాలు	13,800	7,800
ఏసీ మిర్చి	19,500	10,000
ఏసీ తాలు	9,500	9,000
పత్తి	7,250	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

గురుకులంలో ఏసీబీ తనిఖీలు

- ఇద్దరు టీచర్ల గైర్హాజరు, అపరిశుభ్రతను గుర్తించిన అధికారులు
- గాంధీనగర్ గురుకులం నిర్వహణపై అసంతృప్తి
- ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్న డీఎస్పీ రమేష్



రిజిస్టర్ ఆధారంగా వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ రమేష్

కారేపల్లి: కారేపల్లి మండలం గాంధీనగర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాలను ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యాన మంగళవారం తనిఖీ చేశారు. ఉదయం 6గంటలకు చేరుకున్న అధికారుల బృందం తనిఖీలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఈసందర్భంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరైనా రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందించే సమయాన వార్డెన్(మ్యాట్రిన్) ప్రవీణ అందుబాటులో లేకపోవడంతో పాటు మెనూ పాటించడం లేదని గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అంతేకాక టాయిలెట్లు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తరగతి గదులేకాక వంటశాల, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులు కొందరు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని వివరించారు. మెనూ పాటించకపోగా, పాడైపోయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారని.. పాడై, పచ్చి అరటి పండ్లను విద్యార్థులకు అందజేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, తనిఖీల అనంతరం ఏసీబీ అధికారులు విద్యార్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకోవడమే కాక విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈక్రమంలో ప్రమాణాలతో కూడిన విద్య బోధించటం లేదని తేలిందని డీఎస్పీ వివరించారు. అలాగే, గురుకులంలో తలెత్తుతున్న సమస్యలపై ప్రిన్సిపాల్ హరికృష్ణ, ఉపాధ్యాయులను ఆరా తీశారు.



వంటలను పరిశీలిస్తున్న అధికారులు

ట్రాక్టర్ పైనుంచి జారిపడి
పారిశుద్ధ్య కార్మికుడు మృతి

చికిత్స చేయించడంలో సిబ్బంది నిర్లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న చేకూరి జానీ (50) ట్రాక్టర పైనుంచి జారిపడటంతో గాయాల పాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఇతర వర్కర్లు తెలిపిన వివరాలు.. 48వ డివిజన్‌లో మంగళవారం చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ ఎక్కిన జానీ ఉదయం 11 గంటలకు ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో ఆయనను జవాన్ స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత కాసేపటికి వచ్చిన కుటుంబీకులు జానీ తల నుంచి రక్తం కారుతుండటంతో ఓ ప్రైవేట్ ఆస్పకి తీసుకెళ్లగా తలకు బలమైన గాయమవడంతో మృతి చెందాడని నిర్ధారించారు. కాగా, జానీ భార్య తేరేజమ్మ సైతం 49వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తుండగా.. వీరికి ఇద్దరు పిల్లలున్నారు.



చేకూరి జానీ (ఫైల్)

సిబ్బంది నిర్లక్ష్యం..

ట్రాక్టర్ పైనుంచి పడిన జానీకి సరైన వైద్యం చేయించకపోవడమే కాక ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఆయనకు జవాన్ పూర్తి స్థాయిలో వైద్యం చేయించకపోగా, మధ్యాహ్నం 3 గంటలకు కార్మిక సంఘాల నాయకులు చెప్పే వరకు కూడా అధికారులకు సమాచారం ఇవ్వలేదు. సమయానికి వైద్యం అందితే జానీ బతికేవాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, కార్మిక సంఘాల నాయకులు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో మేయర్ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై వివిధ సంఘాల నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, కె.శ్రీనివాస్ కమిషనర్‌తో చర్చించడంతో ఆయన కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, దహన సంస్కారాలకు తక్షణ సాయంగా రూ.20 వేలు అందిస్తామని తెలిపారు. అంతేకాక నిర్లక్ష్యంగా వ్యవహరించిన జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరగా వారిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్ష (న్యాస్)లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మం శాంతినగర్ హైస్కూల్‌లో ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన జీవశాస్త్రం, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు న్యాస్‌పై ఇస్తున్న శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేలా బోధనలో మార్పులు తీసుకురావాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం డాన్ బాస్కో, రిసోర్స్ పర్సన్లు మాధవరావు, రామారావు, ఉద్దండు షరీఫ్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతకాని లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్

చింతకాని: చింతకాని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈ నంబూరి రామారావు తెలిపారు. మండలంలోని నర్సింహాపురానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జల్లి రాము ఇటీవల విద్యుత్ ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్‌సీ విషయంలో షరీఫ్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలటంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు డీఈ తెలిపారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం కామేపల్లి డీసీసీబీ బ్రాంచ్‌లో రైతు రుణమాఫీ చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. త్వరలో ధరణిలో మార్పులు చేర్పులు చేసి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, నాయకులు గింజల నరసింహారెడ్డి, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, డీసీసీ బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, కామేపల్లి డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి



నామినీకి చెక్కు అందజేస్తున్న అధికారులు

కల్లూరు: పోస్టాఫీస్‌ల్లో తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న బీమాను అందరూ వినియోగించుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరిండెంటెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. లంకపల్లికి చెందిన రాచూరి శ్రీనివాసరావు తపాలా శాఖ ద్వారా బీమా తీసుకోగా ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మంగళవారం రూ.10 లక్షల చెక్కును సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, ఐపీబీపీ జిల్లా మేనేజర్ రాజేష్ కల్లూరు పోస్టాఫీస్‌లో అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 60 వేల మంది బీమా చేయించుకోగా ప్రమాదవశాత్తు మరణించిన 23 మందికి పరిహారం అందిందని తెలిపారు. ఏటా రూ.320ప్రీమియంతో రూ.5లక్షలు, రూ.520తో రూ.10లక్షలు, రూ.755 తో రూ.15లక్ష బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో ఉద్యోగులు ఖమ్మంపాటి రాజా, ఎం.రామకృష్ణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బియ్యం సరఫరా చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీలర్లు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నగరంలోని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండల లెవల్ స్టాక్(ఎంఎల్‌ఎస్) పాయింట్ల వద్ద రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకన్న, జానిమియాలు మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ వచ్చినా దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదని, తక్షణమే సరఫరా చేయాలన్నారు. దీనిపై స్పందించిన జిల్లా మేనేజర్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, మహేష్, పాపారావు, బాబు, మురళీ పాల్గొన్నారు.

అమ్మా... లేమ్మా

- తల్లి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరైన చిన్నారులు



రమ్య (ఫైల్)

నేలకొండపల్లి: అమ్మా లేమ్మా.... ఆకలి అవుతోంది.. అంటూ ఇద్దరు చిన్నారులు తల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మండలంలోని మంగాపురతండా గ్రామానికి చెందిన భూక్యా రమ్య –రాజీవ్‌గాంధీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండగా రమ్య అనారోగ్యంతో మంచం ఎక్కింది. ఆమె భర్త అందినకాడికల్లా అప్పు తెచ్చి వైద్యం చేయించినా ఫలితం కానరాకపోగా పరిస్థితి విషమించి మంగళవారం ఆమె మృతి చెందింది. దీంతో ఆరు, నాలుగేళ్ల కుమార్తెలు శాన్వి, సంగీత తల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టిస్తుంది. తల్లి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయిందని తెలియక చిన్నారులు కన్నీరుమున్నీరు కాగా స్థానికులు ఓదార్చారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



నర్సయ్యచారి (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని తిమ్మక్కపేటకు చెందిన వ్యక్తి చేపల వేటకు వెళ్లి మంగళవారం చెరువులో మృతదేహమై తేలాడు. గ్రామానికి చెందిన వెగ్గళం నర్సయ్యాచారి(50) ఖమ్మంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 11న ఉదయం చేపల వేటకు గ్రామంలోని తీగల చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ చెరువు బురదలో దిగబడి మృతి చెందగా, మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. నర్సయ్యాచారికి భార్య, కుమారుడు ఉండగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బంగ్లాకు చెందిన సూరబోయిన రఘుపతి(50) తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మంగళవారం మరిపెడ వెళ్లేందుకు బయలుదేరి ఇంకొకరి బైక్‌పై లిఫ్ట్ అడిగి మేకలతండా స్టేజీ వద్ద దిగాడు. అక్కడి నుంచి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. రఘుపతికి భార్య, కుమార్తె ఉండగా ఆయన మృతదేహం వద్ద వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

జ్వరంతో ఎనిమిదేళ్ల బాలుడు...



జస్వంత్ (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని పంగిడికి చెందిన భూక్యా జస్వంత్(8) జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన భూక్యా అమర్‌లాల్ - కస్తూరి దంపతుల ఏకైక కుమారుడు జస్వంత్ పది రోజుల క్రితం జ్వరం బారిన పడగా చికిత్సతో కోలుకున్నాడు. మళ్లీ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు కన్నుమూయడంతో అమర్‌లాల్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించగా.. మంచుకొండ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది వివరాలు సేకరించారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి వృద్ధురాలు..

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు కాల్వలో పడిన వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తకొత్తూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోత్ బుజ్జి(85)కి కొన్నాళ్లుగా మతిస్థిమితం లేదని తెలుస్తోంది. ఈక్రమంలో మంగళవారం నందిగామ బ్రాంచి కెనాల్ పక్క నుంచి ఇంటికి వెళ్తున్న ఆమె ప్రమాదవశాత్తు కాల్వలో పడింది. ఆపై ఆమె రెండు కి.మీ. మేర ప్రవాహంలో కొట్టుకుపోయి ఏపుగా పెరిగిన చెట్లకు చిక్కుకుని ఆగిపోయింది. అప్పటికే మృతి చెందిన బుజ్జి మృతదేహాన్ని బయటకు తీయగా బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనుబల్లి: ఓ ఆర్‌ఎంపీ తెలిసీతెలియక చేసిన వైద్యంతో ఓ మహిళ మృత్యువాత పడింది. మండలంలోని లంకపల్లికి చెందిన రాయల లక్ష్మి (32) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకుంటోంది. ఈ క్రమంలో జ్వరం తగ్గకపోవడంతో ఆమె మంగళవారం ఆర్‌ఎంపీని సంప్రదించగా సెలైన్ ఎక్కించాడు. మధ్యలోనే లక్ష్మికి వణుకు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్తుండటంతో ఇంజక్షన్ చేశాడు. ఆపై పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆమెను ఖమ్మం తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మంకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయం తెలియగానే సదరు ఆర్‌ఎంపీ తన మెడికల్ షాప్ మూసేసి పరారయ్యాడు. మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ వచ్చీరాని వైద్యం చేయడంతోనే లక్ష్మి మృతి చెందిందని బంధువులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మి (ఫైల్)

పోలీస్ జీప్ నంబర్‌తో బైక్!

సిరిసిల్లలో బొలెరో, ఖమ్మంలో టూవీలర్

సిరిసిల్లటౌన్: ఈ రెండు ఫొటోలు చూశారా.. ఒకటి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పోలీసుల బొలెరో వాహనం. మరొకటి ఖమ్మం జిల్లా జలగంనగర్‌లోని బైక్. ఈ రెండు వాహనాల నంబర్లు టీఎస్ 09పీసీ 4009గా ఉన్నాయి. సాధారణంగా పోలీస్ వాహనాలకు టీఎస్ 09పీసీ సిరీస్‌తో నంబర్లు కేటాయిస్తారు. కానీ, ఖమ్మం జలగంనగర్‌లోనూ ఓ వ్యక్తి బైక్‌కు ఇదే నంబర్ నమోదైంది. సదరు బైక్‌పై వ్యక్తి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తుండడంతో పోలీసులు ఫొటో తీసి ఏప్రిల్ 30న ఆన్‌లైన్ ద్వారా రూ.100 పెనాల్టీ విధించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్ ఈ–చలాన్‌లో బైక్ యజమాని పేరు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ టీఎస్ ఉండడం విశేషం. అయితే రెండింటిలో ఏది అసలు.. ఏది నకిలీ అనేది తేలాల్సి ఉంది. ఈవిషయమై సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణను వివరణ కోరగా.. ఖమ్మం పోలీసుల సహకారంతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



సిరిసిల్ల పోలీస్ వాహనం



ఖమ్మంలో చలానా పడిన బైక్

పావురాల గూడులో నాగుపాము



గూడులో ఉన్న పాము

మధిర: మధిర ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో ఏర్పాటుచేసిన పావురాల గూడులో మంగళవారం నాగుపాము కనిపించింది. అప్పటికే పాము నాలుగు పావురాలు, రెండు కోళ్లను కాటేయడంతో అవి మృతి చెందాయి. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుడు దోర్నాల రామకృష్ణకు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని పామును బంధించి అడవిలో వదిలేశాడు. నిత్యం ఆడుకునే చిన్నపిల్లలు ప్రాంతంలోకి సర్పం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

తహసీల్‌లో పాము కలకలం

ఏన్కూరు: ఏన్కూరు తహసీల్ కార్యాలయంలో మంగళవారం త్రాచుపాము కలకలం సృష్టించింది. తహసీల్దార్ చాంబర్ ఎదురు గదిలో పాము కనిపించడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. అయితే, కాసేపు పాము అక్కడే తచ్చాడి ఆ తర్వాత వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గంగారం గిరిజన సొసైటీ భూములపై వివాదం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని బేతుపల్లి రెవెన్యూకు చెందిన 125 ఎకరాల భూమిపై వివాదం నెలకొంది. రామగోవిందాపురం పంచాయతీ పరిధి కొమురం భీం కాలనీకి చెందిన 24కుటుంబాలు ఐదెకరాల చొప్పున యాభై ఏళ్ల నుంచి ఈ భూమిని సాగు చేస్తూ వారసులకు అందించారు. ఈక్రమంలో 9మంది సభ్యులుగా ఉన్న ఎస్టీ సొసైటీ ఆధ్వర్యాన వివాదం కొనసాగుతోంది. వారసత్వంగా వాటా ఇవ్వడం లేదని కొందరు చెబుతుండగా, సోయం వెంకటేశ్వరరావు కుమార్తె నాగవేణి, శేషయ్య కుమార్తె దివ్య, వెంకటేశ్వరరావు కుమార్తె కృష్ణవేణి, సత్యనారాయణ కుమార్తె కృష్ణకుమారి ఆందోళన చేస్తున్నారు. ఈ భూముల కౌలుకు ఎక్కువ ధర చెల్లించేందుకు మంగళవారం ఓ వ్యక్తి ముందుకొచ్చాడు. దీంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరిగింది. సొసైటీలో వేరే గ్రామాల వారి పేర్లు చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుల వీరంగం.. దంపతులపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో కానిస్టేబుల్ సమక్షాన ఇద్దరు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లీపురానికి చెందిన నర్సింహారావు దంపతులు గాంధీచౌక్‌లో పనులు ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వెళ్తున్నారు. మద్యం మత్తులో వేగంగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు వీరి వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే యత్నంలో ఢీకొట్టారు. దీంతో వివాదం మొదలుకాగా మత్తులో ఉన్న యువకులు నర్సింహారావుపై దాడి చేశారు. అడ్డుకోబోయిన ఆయన భార్యపైనా దాడికి పాల్పడ్డారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. ఆపై బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు శ్రీనివాస్‌నగర్‌కు చెందిన గణేశ్, సాయి వెంకట్‌ను నిందితులుగా గుర్తించి మంగళవారం కేసు నమోదు చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబంద్ జిల్లాలో మంగళవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగగా ఘటనాస్థలి నుంచి మావోయిస్టులు తప్పించుకుని పారిపోయారు. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన బలగాలు పెద్ద ఎత్తున నగదు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతరి – గరియాబంద్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గరియాబంద్ జిల్లాలోని శోభా పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలు పెట్టగా పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. అనంతరం మావోయిస్టులు తప్పించుకోగా అక్కడ భూమిలో పాతిపెట్టిన డంప్ లభ్యమైంది. వెలికితీయగా రూ.38 లక్షల నగదు, భారీగా మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, మందులు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, నగదులో గతంలో రద్దయిన రూ.2 వేల నోట్లే సుమారు రూ.10 లక్షల మేర ఉన్నట్లు తెలిసింది. అయితే ఎదురుకాల్పుల నుంచి తప్పించుకుపోయిన మావోల కోసం కూంబింగ్ ముమ్మరం చేశారు.

KVB కరూర్ వైశ్యా బ్యాంక్

బంగారునగల వేలం ప్రకటన

మా బ్యాంకు శాఖయందు ఈ దిగువ ఉదహరించిన వ్యక్తులు వారి తాలూకు బంగారు నగలు తాకట్టు పెట్టి ఋణము పొందియున్నారు. లోన్ దరఖాస్తులో సూచించిన చిరునామాకు నోటీసులు పంపించినా ఋణము తిరిగి చెల్లించనందువల్ల ఆభరణములను దిగువ తెలిపిన శాఖ ఆవరణములో తేది: 28-8-2024న మ॥3.30 గం॥లకు వేలం వేయబడును.

ఖమ్మం బ్రాంచ్: 3-1-3/1 & 2, సుందర్ టాకీస్ రోడ్, ఖమ్మం. తెలంగాణ-507003

క్ర. సం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం గ్రాములలో	రిజర్వు ధర	ధరావత్తు
1.	బి. వెంకన్న, ఇ.నెం. 5-3-252/4, పాకబండ బజార్, ఖమ్మం.	24.6 44.2 16.9	1,12,000/- 2,04,000/- 84,000/-	11,200/- 20,400/- 8,400/-

ముఖ్యమైన నియమ నిబంధనలు: 1) పైన తెలిపిన ఋణగ్రహీతకు జారీ నోటీసులు అవి ఏకారణము చేతనైననూ తిరిగి వచ్చినచో దీనినే నోటీస్‌గా భావించవలెను. 2) ఒక వేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3) ధరావత్తును బ్యాంకు వారు వేలం తేది మ॥ 3.00 గం॥ వరకు మాత్రమే స్వీకరించబడును. 4) విజయవంతమైన పాటదారుడు వేలం తేది: 28-08-2024న మ॥4.00 గం॥లలో ధరావత్తు కినహా మిగిలిన మొత్తమును చెల్లించి, నగలను సొంత బాధ్యత వహించి పొందవలెను. 5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకోవలెను. అందుకు బ్యాంకు బాధ్యత వహించబోదు. 6) ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండా వేలమును పాక్షికముగాను, మొత్తంగాను రద్దు చేయుటకు అధికారము బ్యాంకుకు కలదు. 7) పాటదారుడు సరైన గుర్తింపు కార్డు మరియు చిరునామా రుజువులను ప్రథమంగా దాఖలు చేయుట తప్పనిసరి. 8) ఇతర ముఖ్య నియమ నిబంధనల కొరకు బ్రాంచి నందు సంప్రదించగలరు. 9) ఆభరణాల అమ్మకంపై GST వర్తించును. బ్రాంచి మేనేజర్ మొబైల్ నెం. 9959988593, బ్రాంచి నెం. 08742-224536

తేది: 14-08-2024, స్థలం: ఖమ్మం సం/- బ్రాంచి మేనేజర్

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ Rainbow Happy Life ప్రొడక్ట్‌ను కొనుగోలు చేసి (2)ని రిఫర్ చేయండి ప్రతి రోజు ఆదాయం, ప్రతినెల కొనుగోలు ద్వారా ప్రతినెల క్యాష్ బ్యాక్ 9700937979 [H-783055]

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

Wanted

■ విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే వుండి, పేషంట్లని / Bedridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్‌టేకర్స్ M/F నర్సులు, RMPలుకావలెను ✆ 9160835559, 9885025559 [B-190]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796266]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957, 9705444182

కొత్తగూడెం : 9010223783

పాల్వంచ : 9705444183

భద్రాచలం : 9951602914

మణుగూరు : 9705944416

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే

(GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.